క్లుప్తంగా

ముగిసిన ఆలయాల వార్షికోత్సవాలు



గుడ్లవల్లేరు: కౌతవరం శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవ దేవస్థానం, శ్రీగంగా పార్వతీ సమేత గౌతమేశ్వరాలయం, గుడ్లవల్లేరు శ్రీరుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయం, వెణుతురుమిల్లి శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయం, శ్రీకోదండ రామస్వామి ఆలయ వార్షికోత్సవాలు గురువారం ఘనంగా ముగిశాయి. వార్షికోత్సవాల్లో భాగంగా స్వామి వార్లకు పవళింపు సేవ నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి స్వామివార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

వెంకన్న సన్నిధిలో మంత్రి రవీంద్ర



గుడ్లవల్లేరు: డోకిపర్రు భూ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామివారిని రాష్ట్ర ఎక్సైజ్ మంత్రి కొల్లు రవీంద్ర గురువారం దర్శించుకున్నారు. ఆలయ మర్యాదలతో మంత్రికి స్వాగతం పలికి దుశ్శాలువాతో సన్మానించి స్వామివారి లడ్డూ ప్రసాదాలను అందించారు. తొలుత మంత్రి రవీంద్ర పేరిట స్వామివారికి వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రేషన్‌కార్డుకు దరఖాస్తు చేసుకోండి



పామర్రు: అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ రేషన్ కార్డుకు దరఖాస్తు చేసుకోవాలని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా సూచించారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో కొత్తరేషన్ కార్డు దరఖాస్తుల ప్రక్రియను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన దరఖాస్తుల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా, ఇప్పటి వరకు ఎన్ని దరఖాస్తులు వచ్చాయని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో కే జ్యోతి, పంచాయతీ కార్యదర్శి అబ్దుల్ సలీం, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

వైద్యుల సమస్యలు పరిష్కరించాలి

గుడ్లవల్లేరు: వైద్యుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఫెడరేషన్ ప్రాథమిక వైద్య సంఘాల సమైక్య ఆంధ్రప్రదేశ్ బేసిక్ మెడికల్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్(బీహెచ్‌ఎంపీఏ) నాయకులు రాష్ట్ర ఎక్సైజ్ శాఖామంత్రి కొల్లు రవీంద్రకు వినతి పత్రం అందజేసినట్లు ఆ సంఘ జిల్లా సెక్రెటరీ అగ్నిహోత్రం ఫణి గోపాల్ గురువారం తెలిపారు. గత వారం రోజులుగా ఉమ్మడి కృష్ణాజిల్లా ఎమ్మెల్యేలకు వినతి పత్రాలు ఇవ్వడం జరుగుతోందన్నారు. మంత్రి సానుకూలంగా స్పందించారని తెలిపారు.

అన్నదాత సుఖీభవ దరఖాస్తుల నమోదు



ముదినేపల్లి రూరల్: అన్నదాత సుఖీభవ పథకానికి అర్హులైన రైతుల నుంచి దరఖాస్తుల నమోదు ప్రక్రియ నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి బీ వేణుమాధవ్ తెలిపారు. మండలంలోని ముదినేపల్లి-2 రైతు సేవా కేంద్రంలో నమోదు ప్రక్రియను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన రైతులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.14వేలు, కేంద్ర ప్రభుత్వం రూ.6 వేలు ప్రతి ఏటా పెట్టుబడి సాయం కింద అందజేస్తుందని చెప్పారు. అర్హులైన రైతులు సమీపంలోని రైతు సేవా కేంద్రాల్లో వ్యవసాయ సహాయకులను సంప్రదించి ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈనెల 20 వరకు నమోదు ప్రక్రియ జరుగుతుందని తెలిపారు.

ఏపీఈసెట్ ఫలితాల్లో సత్తాచాటిన విద్యార్థి



పమిడిముక్కల: ఏపీఈసెట్ ఫలితాలను గురువారం విడుదల చేశారు. ఈ ఫలితాల్లో మండలంలోని చోరగుడి గ్రామానికి చెందిన మేకా మహేష్ కంప్యూటర్ సైన్స్ విభాగంలో రాష్ట్ర స్థాయిలో ఆరో ర్యాంక్ సాధించాడు. విద్యార్థి తండ్రి వీరశ్రీనివాసరావు రైతు. రాష్ట్ర స్థాయిలో ర్యాంక్ సాధించిన మహేష్‌ను గ్రామ సర్పంచ్ కందిమళ్ల పూర్ణకుమారి, ఎంపీటీసీ సభ్యుడు మర్రి దుర్గారావు, గ్రామస్తులు అభినందించారు. కాగా ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ఇంజినీరింగ్ చేయాలని ఉందని మేకా మహేష్ తెలిపారు.

రైతు సేవా కేంద్రాలు నిర్వీర్యం

- రేషనలైజేషన్ పేరుతో కుదింపునకు కూటమి ప్రభుత్వం కుట్ర
- ఇప్పటికే రైతు సేవా కేంద్రాల్లో అందని సేవలు
- ఆందోళనలో అన్నదాతలు



రైతు భరోసా కేంద్రం(ఫైల్)

గుడివాడరూరల్: రైతు భరోసా కేంద్రాలను గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చాలా ప్రతిష్టాత్మకంగా తీసుకుని ఏర్పాటు చేసింది. రైతన్నలకు అన్ని విధాలుగా ఉపయోగపడేలా చేసింది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వాటి విషయంలో కుట్రపూరితంగా వ్యవహరించి రైతు భరోసా కేంద్రాలను రైతు సేవా కేంద్రాలుగా పేరు మార్చింది. కానీ నేడు వాటి వల్ల ఎటువంటి ప్రయోజనం ఉండటం లేదు. రైతన్న సంక్షేమమే ధ్యేయంగా వారి ప్రయోజనాల కోసం గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం గ్రామస్థాయిలో రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి అనేక సేవలు అందించింది. రాయితీ విత్తనాలు, ఎరువులు, పంటల సాగుకు అవసరమైన సలహాలు, ఈ-క్రాప్ నమోదు, ఈకేవైసీ, ధాన్యం కొనుగోలు, పశువుల దాణా సరఫరా తదితర సేవలు అన్నదాతలకు అందించేలా వాటిని తీర్చిదిద్దారు. రైతు భరోసా కేంద్రాలకు సొంత భవనాలు ఏర్పాటు చేశారు. గత ప్రభుత్వ హయాంలో రైతాంగం తమ తమ గ్రామాల్లోనే అన్ని రకాల సేవలు, సౌకర్యాలను పొందారు.

గుడివాడ నియోజకవర్గంలో రైతు సేవా కేంద్రాల వివరాలు..	
గుడివాడ అర్బన్, రూరల్‌లో	14
గుడ్లవల్లేరు	17
నందివాడ	12

తగ్గిపోనున్న రైతు సేవా కేంద్రాలు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పరిస్థితులు మారిపోయాయి. రాయితీ విత్తనాలు ఇవ్వడం చాలా వరకు తగ్గించేశారు. సబ్సిడీపై ఎరువులను నామమాత్రంగా అందిస్తున్నారు. అది కూడా రైతు సేవా కేంద్రాల నుంచి కాకుండా అధిక శాతం సింగిల్ విండోల ద్వారా విక్రయాలను చేపట్టారు. తాజాగా రేషనలైజేషన్ పేరుతో రెండు వేల ఎకరాలు ఉండే గ్రామాల్లో మాత్రమే కేంద్రాలను కొనసాగించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ప్రక్రియ పూర్తయితే నియోజకవర్గంలో చాలా రైతుసేవా కేంద్రాలు తగ్గిపోనున్నాయి. దీంతో తీవ్రంగా ఇబ్బందులు పడే అవకాశం ఉందని రైతన్నలు ఆందోళన చెందుతున్నారు.

రైతు సేవా కేంద్రాలను కొనసాగించాలి



రైతు సేవా కేంద్రాలను కొనసాగించాలి. వాటి వల్ల రైతులకు ఎంతో ప్రయోజనం ఉంది. విత్తనాలు, ఎరువులు గ్రామాల్లోనే పొందే అవకాశం ఉంటుంది. పంటల సాగుకు అవసరమైన సలహాలు, సూచనలు అందించేందుకు సిబ్బంది అందుబాటులో ఉంటారు.

– శ్రీనివాస్, రైతు, బొమ్ములూరు

రైతులకు ఇబ్బందులు



గతంలో రైతు భరోసా కేంద్రాల్లో ఎప్పుడూ ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉండేవి. గ్రామాల్లో రైతులకు అనేక సేవలందిస్తున్న కేంద్రాలు మూతపడకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టాలి. లేకుంటే రైతులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుంది.

– రవి, రైతు, లింగవరం

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి



కార్మికులకు సమస్యలు వివరిస్తున్న సీఐటీయూ నాయకులు

గుడివాడ టౌన్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్‌ల రద్దు కోరుతూ ఈనెల 20వ తేదీన జరగనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్‌సీపీ రెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక ఆటోనగర్‌లో గురువారం కార్మికులను సమ్మెకు సమాయత్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాల వల్ల భవిష్యత్‌లో కార్మికులు ఎదుర్కొనే సమస్యలను వివరించారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా చేపడుతున్న సమ్మెకు సంపూర్ణ మద్దతు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ కార్యదర్శి ఎం. వెంకటేశ్వరరావు, బీ వెంకటేశ్వరరావు, గుడివాడ పట్టణ కమిటీ సభ్యులు సీహెచ్ శివ, ఆర్ కొండ, నాగరాజు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో విద్యార్థులకు ఆటవిడుపు



జమీగొల్వేపల్లిలో జాతీయ నాయకుల పుస్తకాలు ప్రదర్శిస్తున్న చిన్నారులు



గుడ్లవల్లేరులో విద్యార్థులకు ఆటల పోటీలు



మండవల్లి గ్రంథాలయంలో పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు

గుడ్లవల్లేరు: వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా విద్యార్థులకు నిర్వహించే క్రీడలతో వారికి ఆటవిడుపు ఏర్పడిందని అంగలూరు, గుడ్లవల్లేరు గ్రంథాలయాధికారులు పీవీవీ పద్మజ, వాణి పేర్కొన్నారు. వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా గురువారం వారు విద్యార్థులకు ఆట పాటలతో పాటు పుస్తక పఠనం, చిత్ర లేఖనం పోటీలను నిర్వహించారు.

పుస్తక ప్రదర్శన

జమీగొల్వేపల్లి(పామర్రు): మండలంలోని జమీగొల్వేపల్లి శాఖా గ్రంథాలయంలో గురువారం స్వాతంత్ర్య సమరయోధుల జీవిత చరిత్ర గ్రంథాల ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి నాగసురేష్, విశ్రాంత ఉద్యోగి సీహెచ్ కృష్ణ మోహన్, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

పామర్రులో..

స్థానిక ద్వితీయ శ్రేణి గ్రంథాలయంలో విద్యార్థులకు నందిపాటి రఘునాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు నీతి కథలను వివరించారు. గ్రంథాలయాధికారి ఝాన్సీరాణి, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం

మండవల్లి: స్థానిక శాఖా గ్రంథాలయంలో గురువారం విద్యార్థులతో పుస్తక పఠనం చేయించారు. వేసవి విజ్ఞాన శిబిరాన్ని విద్యార్థులంతా వినియోగించుకోవాలని లైబ్రేరియన్ ఎస్‌కే పర్వీన కోరారు.

ముదినేపల్లిలో..

ముదినేపల్లి రూరల్: స్థానిక శాఖా గ్రంథాలయంలోనూ విద్యార్థులతో పుస్తక పఠనం చేయించారు. లైబ్రేరియన్ ఎం.శ్రీదేవి విద్యార్థులకు పలు రకాల నీతికథల పుస్తకాలు అందజేసి చదివించారు. అనంతరం ఆటల పోటీలు నిర్వహించారు.

తాగునీరు విడుదల చేయాలంటూ ఆందోళన



మల్లాయపాలెంలో ఆందోళన చేస్తున్న శ్రీకాళహస్తి అభివృద్ధి కమిటీ సభ్యులు

గుడివాడరూరల్: మండలంలోని మల్లాయపాలెం గ్రామ పరిధిలో ఉన్న శ్రీకాళహస్తి కాలనీకి పైపుల ద్వారా తాగునీరు విడుదల చేయకపోవడంతో ఆ కాలనీ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో గురువారం సచివాలయాన్ని దిగ్బంధించి ఆందోళన చేశారు. ఈ సందర్భంగా పలువురు కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము గత పర్యటనలో తాగునీటిని వీలైనంత త్వరగా విడుదల చేస్తామని రెండు దఫాలుగా హామీలు ఇచ్చారని, కానీ నేటికి విడుదల చేయలేదని విమర్శించారు. ఇప్పటికే రెండుసార్లు గడువు ఇచ్చామని మూడో గడువు ఇచ్చేది లేదని వెంటనే తాగునీటిని విడుదల చేయకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అదేవిధంగా ఇంటి పన్ను, కరెంట్ బిల్లు ఉన్న ప్రతి ఒక్కరికి రూపాయికే ఉచితంగా రిజిస్ట్రేషన్ చేయాలని, పొజిషన్ సర్టిఫికెట్లు ఇవ్వాలని, ఖాళీ స్థలాలు ఆక్రమణలకు గురి కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అభివృద్ధి కమిటీ ఉపాధ్యక్షురాలు ఉత్తర లక్ష్మి, మరియమ్మ, సహాయ కార్యదర్శి దుర్గ, సభ్యులు బేబి, స్వప్న, మాలతి తదితరులు పాల్గొన్నారు.

నేడు శ్రీలక్ష్మీగణపతి హోమం

గుడివాడ టౌన్: స్థానిక మెయిన్‌రోడ్డులో వేంచేసియున్న శ్రీవిఘ్నేశ్వరస్వామివారి దేవస్థానంలో శుక్రవారం శ్రీలక్ష్మీగణపతి హోమం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ వై. శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయ ఆవరణలో ఉదయం 9.30 గంటలకు హోమం ప్రారంభమవుతుందని చెప్పారు. హోమంలో పాల్గొనే భక్తులు రూ. 516 చెల్లించి తమ గోత్రనామాలను నమోదు చేసుకోవలసిందిగా ఆయన కోరారు.

పంచాయతీల అభివృద్ధికి కృషి చేయాలి



కార్యదర్శుల సమావేశంలో మాట్లాడుతున్న డీపీఓ అనురాధ

ముదినేపల్లి రూరల్: పంచాయతీ కార్యదర్శులు గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని జిల్లా పంచాయతీ అధికారి కే అనురాధ అన్నారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల పంచాయతీ కార్యదర్శులతో ముదినేపల్లిలో గురువారం ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంచాయతీల అభివృద్ధికి సహకరించే పన్నుల వసూళ్లపై దృష్టి పెట్టాలన్నారు. ప్రభుత్వం విడుదల చేసే గ్రాంట్లతో పాటు పన్నుల వసూళ్లు తోడైతే అభివృద్ధి పనులు సమర్థవంతంగా నిర్వహించవచ్చని చెప్పారు. పంచాయతీల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనుల ప్రాధాన్యతకు అనుగుణంగా కేటాయించుకుని నిధుల లభ్యతను బట్టి పూర్తి చేసుకోవాలని సూచించారు. చెత్త నుంచి సంపద తయారీ చేసే కేంద్రాలు సక్రమంగా నిర్వహించాలన్నారు. వాటిపై చేస్తున్న వ్యయాన్ని ఆదాయ రూపంలో మలుచుకునేందుకు కృషి చేయాలని పేర్కొన్నారు. డీఎల్పీఓ పూర్ణచంద్రశేఖర్, ఎంపీడీఓ వై రామకృష్ణ, ఈఓపీఆర్డీ బీ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తూనికలు కొలతల దినోత్సవం



పామర్రు: స్థానిక విజయవాడ రోడ్డులోని శ్రీప్రియ ఇండియన్ గ్యాస్ ఏజెన్సీ ఆవరణలో ఏజెన్సీ అధినేత జొన్నల సతీష్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం ప్రపంచ తూనికలు కొలతల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా కృష్ణాజిల్లా అసిస్టెంట్ కంట్రోలర్ లీగల్ మెట్రాలజీ అధికారి టీ రాజేంద్ర ప్రసాద్ పాల్గొని మాట్లాడుతూ వినియోగదారులు గ్యాస్ బండను తీసుకునే ముందు బండ బరువు 14.2 కేజీలు ఉండేలా చూసుకోవాలని అన్నారు. వినియోగదారులను ఎవరైనా మోసం చేస్తే ఏ విధంగా స్పందించాలని అనే విషయాన్ని వివరించారు. వినియోగదారులు ఎంఆర్‌పీ కంటే ఎక్కువ చెల్లించవద్దని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ రామకృష్ణంరాజు, సిబ్బంది శ్రీనివాసరావు, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వికాస తరంగిణి ప్రజ్ఞా తరగతులు



బహుమతులు అందుకున్న చిన్నారులతో నిర్వాహకులు

కైకలూరు: విద్యార్థులకు వేసవి సెలవుల్లో మీసాల వెంకన్నస్వామి దేవాలయంలో శ్రీమన్నారాయణ గోష్ఠి ఆధ్వర్యంలో ఈ నెల ఒకటి నుంచి 15వ తేదీ వరకు నిర్వహించిన భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, భజనలు, కీర్తనలు, శ్లోకాలు, ప్రార్థనలు, ఆటలు, చిత్రలేఖనం, నైతిక విలువలు, యోగా శిక్షణ గురువారంతో ముగిశాయి. శ్రీమన్నారాయణ గోష్ఠి నిర్వాహకురాలు సీహెచ్ హేమలత ఆధ్వర్యంలో చివరి రోజు విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 'వికాస తరంగిణి ప్రజ్ఞా' ద్వారా విద్యార్థులకు ప్రతి ఏడాది వేసవిలో వివిధ అంశాలపై శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. చిన్నారులంతా మన సంస్కృతి, సంప్రదాయాలకు అనుగుణంగా మంచి నడవడికను అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వికాస తరంగిణి సభ్యులు విజయలక్ష్మి, మారగాని శ్యామల, సత్యవతి, గూడూరి భవానీ, చైతన్య రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో రోడ్డుకు మరమ్మతులు



చోరగుడిలో రహదారి మరమ్మతులు పర్యవేక్షిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

పమిడిముక్కల: మంటాడ – లంకపల్లి ప్రధాన రహదారికి మండలంలోని చోరగుడి వద్ద వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో గురువారం మరమ్మతులు చేపట్టారు. గ్రామ పరిధిలో రోడ్డంతా గుంతలు పడి, రాళ్లు మొనతేలి ప్రమాదకరంగా మారింది. మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కైలే అనిల్‌కుమార్ రోడ్డు దుస్థితి చూసి మరమ్మతులు చేపట్టాలని పార్టీ స్థానిక నాయకులకు సూచించారు. దీంతో వైఎస్సార్ సీపీ నాయకుడు బాసు రమేష్ సొంత ఖర్చుతో రోడ్డును చదును చేయించారు. రోడ్డు పనులను పార్టీ నాయకులు మర్రి బాబూరావు, నల్లజర్ల సీతారామయ్య, శివరామకృష్ణ, అడపా వెంకట్ పర్యవేక్షించారు.

అన్నసమారాధన



మండవల్లి: మండవల్లి పీహెచ్‌సీ వద్ద కొలువై ఉన్న శ్రీషిర్డీ సాయిబాబా ఆలయంలో పెద్దిరెడ్డి సుబ్రహ్మణ్యం ఆర్థిక సాయంతో గురువారం అన్నసమారాధన నిర్వహించారు. తొలుత బాబావారికి విశేష పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వడాలిలో..

ముదినేపల్లి రూరల్: రెండో పూరీగా ప్రసిద్ధి చెందిన మండలంలోని వడాలి శ్రీజగన్నాథస్వామి ఆలయం వద్ద గురువారం అన్నసమారాధన నిర్వహించారు. స్వామివారి ఆలయ వార్షికోత్సవాలు ఈనెల 10న ప్రారంభం కాగా గురువారంతో ముగిశాయి. ఆలయ ఈఓ శింగనపల్లి శ్రీనివాసరావు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

సీపెట్ డిప్లొమా కోర్సులకు దరఖాస్తు చేసుకోండి

గుడివాడ టౌన్: సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రో కెమికల్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ(సీపెట్) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డిప్లొమా కోర్సులకు దరఖాస్తు చేసుకోవాలని డైరెక్టర్ సీహెచ్ శేఖర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి పాసై మూడు సంవత్సరాల ప్లాస్టిక్ టెక్నాలజీ డిప్లొమా, డిప్లొమా ఇన్ ప్లాస్టిక్ మౌల్డ్ టెక్నాలజీ, బీఎస్సీ ఉత్తీర్ణతతో రెండు సంవత్సరాలు పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ ప్లాస్టిక్స్ ప్రాసెస్సింగ్ అండ్ టెస్టింగ్ కోర్సులకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసిందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 29వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఇక్కడ కోర్సులు చేసే విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వ ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తిస్తుందన్నారు. సీపెట్ అడ్మిషన్ టెస్ట్ జూన్ 8వ తేదీ నిర్వహిస్తామని చెప్పారు. అందులో వచ్చిన ర్యాంకుల ఆధారంగా విజయవాడ కేంద్రంలో 150 సీట్లు భర్తీ చేస్తామని తెలిపారు. దరఖాస్తు రుసుం రూ. 100 చెల్లించాలని పూర్తి వివరాలకు 93985 35697 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

కౌలు గుర్తింపు కార్డులపై అవగాహన

కైకలూరు: కౌలు రైతులకు అందించే కార్డుతో అసలు భూ యజమానులకు ఎలాంటి నష్టం ఉండదని మండల వ్యవసాయాధికారి ఆర్ దివ్య స్పష్టం చేశారు. కైకలూరు రెవెన్యూ కార్యాలయంలో గ్రామ రెవెన్యూ అధికారులు(వీఆర్వో), గ్రామ వ్యవసాయ సహాయకులు(వీఏఏ)లకు పంట సాగుదారు హక్కు పత్రం(సీసీఆర్‌సీ, కౌలు గుర్తింపు కార్డులు)పై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి కౌలు రైతు కౌలు చేసే భూమి యజమాని అంగీకారంతోనే కౌలు కార్డు తీసుకోవాలన్నారు. ఈ కార్డు కేవలం 11 నెలల పరిమితితో జారీ చేస్తారన్నారు. దీని వల్ల కౌలు రైతుకు వ్యవసాయశాఖ అమలు చేసే వివిధ పథకాలు, ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తే పంట నష్టం, పంట రుణాలు దక్కుతాయన్నారు. కౌలు రైతులు ఆధార్, ఫొటో, సాగు చేసే భూ యజమాని పొలం పాస్ బుక్ జిరాక్స్‌లను గ్రామ రెవెన్యూ అధికారి లేదా వీఏఏకు అందజేయాలని సూచించారు. గ్రామ రెవెన్యూ అధికారి లాగ్‌ఇన్ నుంచి ఈ-సీసీఆర్‌సీ కార్డులు రైతులకు మంజూరు చేస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో కైకలూరు ఆర్ఐ బీ వెంకటేశ్వరరావు, ఆయా గ్రామాల వీఆర్వోలు, వీఏఏలు పాల్గొన్నారు.

పచ్చిరొట్టతో భూసారం పెంపు



పచ్చిరొట్ట విత్తనాల కిట్లను పంపిణీ చేస్తున్న ఏఓ వేణుమాధవ్

ముదినేపల్లి రూరల్: పచ్చిరొట్ట సాగుతో భూసారాన్ని పెంచుకోవచ్చని వ్యవసాయాధికారి బీ వేణుమాధవ్ పేర్కొన్నారు. స్థానిక రైతు సేవా కేంద్రం వద్ద పచ్చిరొట్ట విత్తనాల కిట్లను గురువారం రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొలకరి వర్షాల్లో భూములు కలియదున్ని పచ్చిరొట్ట విత్తనాలు చల్లితే పైర్లు ఏపుగా పెరిగి భూసారాన్ని పరిరక్షిస్తాయన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ మండల ఇన్‌చార్జి గౌతమ్‌కుమార్, వీఏఏలు పవన్, రవీంద్ర, పద్మ పాల్గొన్నారు.

మృతిచెందిన యువకుడి గుర్తింపు

కైకలూరు: మూర్ఛ వ్యాధిలో ఆచవరం రైల్వేగేటు సమీపంలో బుధవారం మృతిచెందిన యువకుడి వివరాలు తెలిశాయి. టౌన్ ఎస్ఐ డీ వెంకట్‌కుమార్ గురువారం తెలిపిన వివరాల ప్రకారం.. అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం చింతలూరు గ్రామానికి చెందిన గుడాల దుర్గాప్రసాద్(26) దేవాలయాల నిర్మాణ శిల్పిగా పని చేస్తున్నాడు. నెల్లూరులో గుడి పనులకు వెళ్లి అనారోగ్యం కారణంగా సర్కారు ఎక్స్‌ప్రెస్‌లో తిరిగి వస్తూ కైకలూరు రైల్వేస్టేషన్‌లో దిగాడు. వాస్తవానికి అతను ద్వారపూడి రైల్వే స్టేషన్‌లో దిగాలి. కైకలూరులో ఓ సెల్ రిపేరు దుకాణంలో బ్యాగ్ పెట్టి సెల్ ఫోన్‌కు రిపేర్ చేయాలని చెప్పి వెళ్లాడు. అనంతరం సదరు యువకుడు ఆచవరం రైల్వేగేటు సమీపంలో మూర్ఛ వ్యాధితో మృతిచెందారు. మృతుడు సోదరుడు సత్యనారాయణ ఫోన్ చేయగా సెల్ ఫోన్ దుకాణ వ్యక్తి జరిగిన విషయాన్ని తెలిపాడు. దీంతో కైకలూరు వచ్చిన వారికి ఆస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని అప్పగించారు.

ఇసుక లారీతో ట్రాఫిక్



తోట్లవల్లూరు: ఇసుక లారీ నిలిచిపోవడంతో ట్రాఫిక్‌కు ఇబ్బందులు ఏర్పడిన ఘటన మండలంలోని యాకమూరు వద్ద జరిగింది. తోట్లవల్లూరు వైపు నుంచి ఉయ్యూరు వైపు వెళుతున్న ఇసుక లారీ కమాన్‌కట్టలు విరిగిపోవడంతో గురువారం మధ్యాహ్నం యాకమూరు మలుపు వద్ద ఒక వైపు ఒరిగిపోయి నిలిచిపోయింది. లారీ పక్కకు ఒరిగిపోవడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. ఇసుక ఓవర్ లోడ్ కారణంగానే కమాన్‌కట్టలు విరిగిపోయి ఉంటాయని వాహనదారులు తెలిపారు. రోడ్డుపై లారీ నిలిచిపోవడంతో తోట్లవల్లూరు–ఉయ్యూరు మార్గంలో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.